క్లుప్తంగా

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

పేదలకు ఇళ్లు కేటాయించాలి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించాలని మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ కోరారు. సోమవారం తహసీల్దార్ కనుకయ్యకు వినతిపత్రం సమర్పించారు.

శిశువు దత్తత



పాపను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని శిశుగృహలో పెరుగుతున్న మూడేళ్ల పాపను సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా యూఎస్‌ఏకు చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. ఇందుకు జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

'తెలుగు తేజం' పురస్కారానికి ఏకుల అయోధ్య ఎంపిక



ఏకుల అయోధ్య

కరీంనగర్‌కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఏటా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన సాహితీవేత్తలకు అందజేసే 'తెలుగు తేజం' పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన రచయిత ఏకుల అయోధ్యను ఎంపిక చేసింది. ఈనెల 31న గుంటూరు జిల్లా నరసరావుపేటలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట: పట్టణంలోని ఆరోగ్య మిత్ర వ్యవస్థాపకుడు డా. పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో సంస్థ రజతోత్సవం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త గాదె గుణసాగర్ మాట్లాడుతూ, ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ 25 ఏళ్లుగా విద్య, వైద్యం, ఆరోగ్యం, స్వయం ప్రతిపత్తి, స్వావలంబన, పర్యావరణం, ఆత్మహత్యల నివారణ తదితర అంశాలపై సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం, జాతీయ అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. బీసీ నాయకుడు శ్రీనివాసులు, దళిత నాయకుడు జీడీ రాజు తదితరులున్నారు.

ప్రజావాణికి ఒక దరఖాస్తు

చిగురుమామిడి: చిగురుమామిడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా కొద్దిరోజులుగా ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోవడంతో బాధితుల తాకిడి తగ్గింది. మళ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజలకు తెలియక దరఖాస్తుదారుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

కొత్తపల్లి: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు కొత్తపల్లి సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. రాజస్తాన్‌కు చెందిన నర్సిరామ్ మద్యం సేవించి వాహనం నడుపుతూ కొత్తపల్లి పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రవీందర్ విచారణ జరిపి మూడు రోజుల రోజుల జైలుతో పాటు రూ.10వేల జరిమానా విధించారని వివరించారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో కె.రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కనీస అభ్యసన స్థాయిలను పరీక్షించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో రాధాకృష్ణుల వేషధారణలో ఉన్న విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, సీఆర్పీ అర్చనతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి

- దుర్శేడ్ సొసైటీలో విక్రయాలపై పర్యవేక్షణ కరువు
- ఇతర గ్రామాల రైతులకు అమ్మకం



దుర్శేడ్ సహకార సంఘం వద్ద యూరియా బస్తాల కోసం రైతుల క్యూ

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘంలో యూరియా బస్తాల విక్రయంపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో పాలకవర్గం అండతో సిబ్బంది అడ్డదారిలో రైతులకు యూరియా బస్తాలను విక్రయిస్తున్నారు. సంఘం పరిధిలోని గ్రామాలవారికి కాకుండా ఇతర గ్రామాలవారికి విక్రయిస్తుండడంతో కొరత ఏర్పడుతుందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

ఒకటి లేదా రెండు బస్తాలే..

వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించడంతోపాటు కొరత దృష్ట్యా అమ్మకాలపై నియంత్రణ విధించింది. ఎకరాకు ఒక బస్తా ఇవ్వాలనే నిబంధనతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో దుర్శేడ్ సంఘంలో కొందరు పాలకవర్గం ప్రతినిధులు అక్రమాలకు తెరలేపారు. సిబ్బంది సాయంతో సంఘం పరిధిలోని వారికి కాకుండా ఇతర గ్రామాల రైతులకు అడిగినన్ని బస్తాలు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా కొంతమంది స్థానిక రైతులు సైతం యూరియా బస్తాలను తీసుకుని తమ బంధువులకు అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే అవసరమున్న రైతులకు మాత్రం ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడురోజులు సెలవుల అనంతరం సోమవారం యూరియా కోసం పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చి బారులు తీరారు. దీంతో సిబ్బంది మొత్తం 243 బస్తాలను విక్రయించారు. నిబంధనల ప్రకారం యూరియా విక్రయిస్తున్నామని, ఎలాంటి కొరత లేదని, సోమవారం సాయంత్రం 15 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వచ్చినట్లు సీఈవో వేణుమాధవ్ తెలిపారు. అలాగే కరీంనగర్ సహకార సంఘం పరిధిలోని చెర్లభూత్కూర్ గోదాంలో 300 యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం యూరియా స్టాక్ లేదని, అధికారులు ఎక్కువమొత్తంలో స్టాక్ కేటాయించాలని సొసైటీ చైర్మన్ పి.శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశం మేరకే సంఘం పరిధిలోని గ్రామాల వారికే కాకుండా మండల పరిధిలోని రైతులందరికీ యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సత్యం తెలిపారు. యూరియా కోసం రైతులు ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో మండల పరిధిలోని సహకార సంఘాలు, ఆగ్రోస్‌సెంటర్లు, డీసీఎంఎస్ కేంద్రాల్లో రైతులందరూ కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.



ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి గ్రామంలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ద్వారం గేటు ఊడిపోయి కిందపడింది. విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కొన్నినెలలుగా గేటు ఊడిపోయి కిందపడినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఊడిపోయిన గేటుకు మరమ్మతు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- రాములునాయక్, ఇన్‌చార్జి ఎంఈవో, ఇల్లందకుంట: సెల్ నం 94939 73015

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సర్దార్ పాపన్న జయంతి



జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న నాయకులు



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న నాయకులు

- నివాళి అర్పించిన గౌడ, ప్రజా సంఘాల నాయకులు

జమ్మికుంట/రామడుగు/ఇల్లందకుంట/చొప్పదండి/హుజూరాబాద్/చిగురుమామిడి/మానకొండూర్/సైదాపూర్: జమ్మికుంట పట్టణంలో సోమవారం దేశిని కోటి, అరెల్లి మల్లయ్య, రాజుగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. టౌన్ సీఐ రామకృష్ణగౌడ్, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో సర్వాయి పాపన్న మోకుదెబ్బగౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న జయంతిని నిర్వహించారు. రామడుగు మండల కేంద్రంతోపాటు గోపాల్‌రావుపేటలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పంజాల జగన్ మోహన్‌గౌడ్, పూరెల్ల మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలం టేకుర్తిలో తోడేటి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చొప్పదండి పట్టణంలో పాపన్న చిత్రపటానికి గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్య, నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. బొడిగె నందిగౌడ్, హన్మంతుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద పాపన్న విగ్రహానికి గౌడ సంఘం, బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ముక్కెర రాజు తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడిలో నిర్వహించిన వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ రవీందర్, కల్లు గీత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మానకొండూరు మండల కేంద్రంతోపాటు చెంజర్ల, కొండపలకల గ్రామాల్లో పాపన్న జయంతిని ఘనంగా జరుపుకున్నారు. సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలం సర్వాయిపేట కొ మ్ముగుట్ట వద్ద పాపన్న విగ్రహానికి కవి మండల జంపన్న ఆధ్వర్యంలో నివాళులర్పించారు. విండో అధ్యక్షుడు తిరుపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక సర్వాయి పాపన్న

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

గంగాధర: బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అడుగుజాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. పాపన్న జయంతిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని బూర్గుపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. నాటి రాజులపై తిరుగుబాటు చేసి బహుజనులకు అండగా నిలబడిన వీరుడు పాపన్న అని కొనియాడారు. అలాగే మండలంలోని గర్శకుర్తిలో వీరాంజనేయస్వామి ఆలయ 42వ వార్షికోత్సవ కార్యక్రమంలో రవిశంకర్ పాల్గొన్నారు.

యూరియా కొరత కాంగ్రెస్ పాపమే

గంగాధర: సాగు తగ్గినా రైతులకు ఎరువులు దొరకని దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వ పాపమేనని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ విమర్శించారు. మండలంలోని గర్శకుర్తిలోని గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం సోమవారం బారులు తీరగా, వారితో మాట్లాడారు. యూరియా కోసం పొద్దంతా నిలుచున్నా సరిపడా బస్తాలు ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. ఈసందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో ఎరువుల కొరత మాటే వినిపించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

గర్భగుడి దర్వాజ మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి గ్రామంలో గల శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం గర్భగుడి దర్వాజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దర్వాజ దాతలు కోడం రాజేశ్వరి, సదానందం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయ పునర్నిర్మాణంలో భక్తులు, పురప్రముఖులు, నాయకులు చేయూత అందించాలని కోరారు.

ట్రాక్టర్‌ను అప్పగించిన పోలీసులు



ట్రాక్టర్‌ను అప్పగిస్తున్న పోలీసులు

వీణవంక: ఇంటిముందు ఉంచిన ట్రాక్టర్ కనిపించకపోవడంతో చోరీకి గురైందని ఆ కుటుంబం కంగారుపడింది. కానీ అది మతిస్థిమితం లేని వ్యక్తి తీసుకెళ్లి మరో చోట పెట్టి మర్చిపోవడంతో పోలీసుల సాయంతో పట్టుకున్నారు. కిష్టంపేటకు చెందిన కల్లెపల్లి అజయ్ అనే రైతు మరో రైతు వద్ద ట్రాక్టర్‌ను లీజుకు తీసుకున్నాడు. తన ఇంటిముందు ట్రాక్టర్‌ను పెట్టగా కనిపించకుండా పోయింది. కంగారు పడిన రైతు ఈనెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన బొంగోని శ్రీనివాస్ మతిస్థిమితం సరిగా లేక ట్రాక్టర్‌ను తీసుకొని సరదాగా తిరిగిరావాలని అనుకున్నాడు. కానీ తాను తీసుకెళ్లిన స్థలం గుర్తుకు రాక జగిత్యాల జిల్లా ధర్మారం మండలం వరకు తీసుకెళ్లారు. అక్కడ వదిలేసి వెళ్లాడు. రెండు రోజులుగా ట్రాక్టర్ అక్కడే ఉండటంతో ధర్మారం పోలీసులు అనుమానం వచ్చి ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఇదీ మతిస్థిమితం లేని శ్రీనివాస్ చేసిన పనేనని పోలీసులు నిర్ధారించారు. పోలీసులు ట్రాక్టర్‌ను అజయ్‌కి అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలపాలి



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

కరీంనగర్: హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఈనెల 25న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు బీసీలంతా హాజరై సంఘీభావం తెలపాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడరాఉ. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తే బీసీలు సహించబోరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, కాటా వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, సంఘం నాయకులు నరాల శ్రీకాంత్, జమాల్ సూరజ్, పొన్నం అశ్విత్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా బర్త్‌డే వేడుకలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో బర్త్‌డే వేడుకలు వివాదాస్పదమయ్యాయి. అదనపు కమిషనర్ సువార్త చాంబర్‌లో సోమవారం ఓ మున్సిపల్ కాంట్రాక్టర్ బర్త్‌డే సందర్భంగా కేక్‌కట్ చేశారు. అధికారిక చాంబర్‌లో కాంట్రాక్టర్ కేక్ కట్ చేసి వేడుకలు చేసుకోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆశీర్వాదం కోసం వచ్చారని అదనపు కమిషనర్ సువార్త అన్నారు. నా చాంబర్‌కు వస్తే ఒక ఆలయానికి వచ్చినట్లుగా ఉంటుందన్నారు. దీనిని కూడా తప్పు పట్టడం సరికాదని ఆమె వివరించారు.

చెల్పూర్ పీహెచ్‌సీ తనిఖీ...



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. హుజూ రాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, పీహెచ్‌సీ డాక్టర్ మధు, హెచ్‌ఈవో విజయేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యం, పలువురు సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

బావిలోపడి వ్యక్తి ఆత్మహత్య.?

జమ్మికుంట : మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి కెనాల్ సమీపంలోని ఓ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జమ్మికుంట ఓవ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడాడ్డని, అటువైపు వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ బావిలో మోటార్ల సాయంతో నీటి తోడుతున్నారు. కానీ మృతదేహం వెలికితీయలేదు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

డీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటు



రాజిరెడ్డి



ఈశ్వర్‌రెడ్డి

కరీంనగర్: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర నూతన కమిటీని హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. కమిటీలో కరీంనగర్ జిల్లా నుంచి డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వి.రాజిరెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చొప్పదండి), రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ఈశ్వర్‌రెడ్డి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హుజూరాబాద్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి ఎన్నికైన రాజిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలకు డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవాల నరహరి, చకినాల రాంమోహన్, సభ్యులు అభినందనలు తెలిపారు.

నష్టపరిహారం ఇవ్వాలని వినతి



కలెక్టరేట్‌లో బాధిత రైతులు

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నవారికి నష్టపరిహారం అందించాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు బాధిత రైతులు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, నోటీసులు ఇవ్వకుండా వేసిన పంటను నిర్లక్ష్యం తొలగిస్తూ పనులు చేపడుతున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, కోర్టులో కేసు వేయడం జరిగిందని వివరించారు. మూడు వారాల గడువులోగా రైతుల సమస్యను పరిష్కరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, కానీ, ఆదేశాలను లెక్క చేయకుండా రోడ్డు పనులు చేపడుతున్నారని, తమ ఆవేదనను అధికారులకు వెల్లబోసుకున్నట్లు మాదాపూర్, ఖాసీంపేట గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీఎస్‌రావు

హుజూరాబాద్ : పట్టణ శివారు కేసీ క్యాంపులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కేంద్రంలో బీఎస్‌రావు హెల్త్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్‌రావు, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్‌రావు మాట్లాడుతూ మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం గ్రంథాలయంలో పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్, మేనేజర్ ఆదాం, శిక్షకురాలు సబిత, మహిళలు పాల్గొన్నారు.

అనిల్ ప్రకాశ్‌పై చర్య తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: డీబీసీ డీవో అనిల్ ప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఆర్డీవో మహేశ్వర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌లో డీబీసీ డీవో ప్రకాశ్ విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. మెరిట్ ప్రకారంగా అడ్మిషన్లు తీసుకుంటున్నామని చెప్తూనే మరోపక్క రికమండేషన్ చేసిన వారికే సీట్లు ఇస్తున్నారని తెలిపారు. డీబీసీ డీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అరవింద్, నాయకులు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.